క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో కృష్ణ అనే వ్యక్తి మృతి చెందడంతో గ్రామ సర్పంచ్ రవియాదవ్ వారి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కిరణాల ప్రసరణతో నొప్పులకు ఉపశమనం

పాములపాడు: ఇన్ ఫ్రా రెడ్ రేస్ బల్బు మిషన్ ద్వారా వెలువడే కిరణాల ద్వారా నొప్పులకు ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారిణి సావిత్రి అన్నారు. స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో నొప్పులకు సంబంధించి వచ్చిన పేషంట్లకు ఈ మిషన్ ద్వారా వైద్యం అందించారు. ఆమె మాట్లాడుతూ కండరాల నొప్పులు, చిన్న బెణుకులు, మానని పుండ్లు, శస్త్ర చికిత్స అనంతరం ఫిజియోథెరపీకి ఈ మిషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

సమయపాలన పాటించండి

కొత్తపల్లి: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. మంగళవారం మండలంలోని కొక్కెరంచ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలపట్ల సేవభావంతో మెలగాలన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం గోపూజ, గణపతి పూజ పుణ్యాహవచనము, మాతృకాపూజనం, పంచగవ్యమేళనం, రక్షాబంధనం తదితర విశేష పూజాధిక కార్యక్రమాలను గిరిధర్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్

మహానంది: మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ గ్రామంలో మంగళవారం రాత్రి భారీ కొండచిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రంగడు ఇంటి వద్ద కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అదే గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించడంతో అతను దానిని పట్టుకొని నల్లమల అటవీప్రాంతంలో వదిలేశాడు.

రేపు మినీ జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థఆధ్వర్యంలో నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. గరుడ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, అవివోమ్ ఇండియా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, గ్రీన్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 5వ తరగతి, పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో పూర్తి చేసిన 18–35 ఏళ్ల యువతీయువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలన్నారు. సమాచారం కోసం 9440224291 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. నంద్యాలలో 29న జరిగే జాబ్‌మేళా వాయిదా పడినట్లు తెలిపారు.

పల్లెల్లోనే ప్రభుత్వ సేవలు

- సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పాలశీతలీకరణ కేంద్రాలకు శాశ్వత భవనాలు
- శరవేగంగా నిర్మాణ పనులు
- ప్రజల చెంతకే అన్ని రకాల సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పల్లె ప్రజలు



ఎదురుపాడులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం, ఆర్‌బీకే భవనం



కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామాల ప్రజల మంగిటకే పాలనను తీసుకువచ్చింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను సమున్నతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంది. గ్రామ ప్రజలకు మౌలిక వసతులు కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తోంది. గ్రామాలలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, పాలశీతలీకరణ కేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మించి గ్రామాల రూపురేఖలను మార్చేవిధంగా చర్యలు తీసుకొంది. ఈ క్రమంలో మండలంలోని పల్లెల్లో ప్రగతి పరుగులు తీస్తుంది.

రూ.4 కోట్లతో భవన నిర్మాణాలు

మౌలిక వసతులు కల్పించే క్రమంలో మండలంలో ఇప్పటికే 11గ్రామ సచివాలయ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నేలా ప్రభుత్వ కార్యాలయాలను పల్లెల్లో తీర్చిదిద్దుతోంది. వీటి నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 4 కోట్లను వెచ్చిస్తోంది. ఇప్పటి వరకు మండలంలో మూడు సచివాలయాలు, మూడు రైతు భరోసా కేంద్రాలు, రెండు హెల్త్‌క్లినిక్‌లు పూర్తికాగా మిగిలిన వాటిలో సుమారు 85 శాతం పనులు పూర్తి అయ్యాయి అయ్యాయి.

హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన వైద్యం

గ్రామాలలో ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తే హుటాహుటిన పట్టణానికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామాలలోనే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోంది. వీటికోసం అవసరమైన 7 భవనాలను నిర్మిస్తోంది. ఈ భవన నిర్మాణాల కోసం రూ 1,10,25,000 వెచ్చిస్తోంది.

రైతన్నల కోసం రైతుభరోసా కేంద్రాలు

రైతన్నల కోసం ప్రభుత్వం రూ2కోట్ల 39 లక్షల 8 వేల వ్యయంతో రైతు భరోసా కేంద్రాలను నిర్మిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రసాయనిక మందులతో పాటు అన్ని సేవలందించేందుకు కృషి చేస్తోంది. వీటిద్వారా రైతులకు వ్యవసాయ సేవలు, శిక్షణ తరగతులు, కాల్ సెంటర్ ద్వారా సలహాలు, సూచనలను అందిస్తుంది. ఆర్‌బీకేలకు అవసరమైన భవన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తుంది.



గువ్వలకుంట్లలో నిర్మాణం పూర్తయిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

పాడిరైతులకు అండగా పాలశీతలీకరణ కేంద్రాలు

గ్రామాలలోని పాడిరైతులకు అండగా ఉండేందుకు, వారికి మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం గ్రామంలోనే ఐదు సెంట్ల స్థలం విస్తీర్ణంలో అన్ని వసతులతో పాలశీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వీటి భవన నిర్మాణ పనులను కుడా చేపడుతోంది.



గోకవరంలో పూర్తయిన సచివాలయ భవన నిర్మాణం

మా ఊర్లోనే సర్టిఫికెట్లు పొందుతున్నాం



సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందుతున్నాయి. ఇదివరకు మేము ఏవైన సర్టిఫికెట్లు కావాలంటే మండల కేంద్రానికి సంబంధిత అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా సరైన సమయంలో ఇచ్చేవారు కాదు. దాంతో కొన్ని ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోయాను. సచివాలయాలు ఏర్పాటు చేశాకా ఇన్‌కమ్, క్యాస్ట్, వన్–బీ, తదితర సర్టిఫికెట్లు సకాలంలో సిబ్బంది ద్వారా అందుతున్నాయి. సమయం వృథా కాకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే ఖర్చు కూడా మిగులుతుంది.

– గుణంపల్లి. స్వామిరెడ్డి, ఎదురుపాడు గ్రామం

డిగ్రీ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

నందికొట్కూరు: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ప్రదర్శనను ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.సునీత ప్రారంభించారు. సుగంధద్రవ్యాలు, పోపు దినుసులు ప్రదర్శించారు. కాంతి విక్షేపణ, న్యూటన్ వలయాలు, సోలార్ సెల్సు, లేజర్ కాంతి వాటి పనిచేయు సూత్రాలను వాటి ప్రాముఖ్యతను వివరించారు. బయోడీజల్ తయారీ విధానాన్ని, జంతువుల శరీర స్పెసిమన్, శరీరంలోని వివిధ వ్యవస్థలను గురించి ప్రదర్శించి వివరించారు. ప్రదర్శనను పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించారు.

మహాసభలను జయప్రదం చేయండి

నందికొట్కూరు: బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్, జై భజరంగదళ్ లాంటి ఫాసిస్టు శక్తులను ఓడించడానికి తలపెట్టిన విప్లవ పార్టీల ఐక్య మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వేల్పుల అర్లప్ప పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం పట్టణంలో మార్చి3వ తేదీన నిర్వహించనున్న సభకు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తిరుపాలు, రమేష్, మనోహర్, చెన్నయ్య, మాబాషా, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

వెలుగోడు: నల్లమల ఆరణ్యంలోని రుద్రకోడురులో జరగనున్న రుద్రకోటేశ్వరస్వామి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బవనాశి మహేష్‌కు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు మాలేపాటి శ్రీనివాసులు, పలం రామ్మోహన్, రామసుబ్బయ్య నంద్యాలకు వెళ్లి మహేష్‌ను శాలువతో సత్కరించి, ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వెలుగోడు: మండలంలోని అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామాల్లో భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేల్పనూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాతా బృందం బ్యాంకు పథకాలు, లావాదేవీలు, సామాజిక భద్రత, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి, బీమా యోజన తదితర పథకాల ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సాయి కృష్ణ, ఎస్‌డబ్ల్యూఓ ఈశ్వర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ నారాయణ, బీసీ వెంకటేశ్వర రెడ్డి, మధు, ఎఫ్ఓఎస్ హనుమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

ఆత్మకూరు: పట్టణంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారని, కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని చెప్పారు. రానున్న ఎన్నికలు, వివిధ కార్యక్రమాలపై కార్యకర్తలతో చర్చిస్తారన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



దామగట్లలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మందుల పంపిణీని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

నందికొట్కూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని వైద్యులు మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంపును నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్యాంపులో 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి రహీం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

పాములపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సర్పంచు కోట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గులాబ్‌షా, జనరల్‌సర్జన్ పూర్ణేశ్వరరావు, ఆర్థోపెడిక్ పవన్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, ఎంపీటీసీ సురేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

పగిడ్యాల: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయని మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. మంగళవారం పగిడ్యాల సచివాలయం 2 పరిధిలో గల కొత్త పాలమర్రి ప్రాథమిక పాఠశాల వద్ద సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అధ్యక్షతన రెండవ విడుత జగనన్న ఆరోగ్య క్యాంప్‌ను నిర్వహించారు. క్యాంప్‌లో 470 మంది రోగులకు తూర్పు ప్రాతకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్పెషలిస్టు వైద్యులు చికిత్సలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, కోట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యాసమయం.. సప్తనదీ సంగమ తీరం

ఈ విశాల విశ్వంలో అంతులేని వింతలు. వాటిలో కొన్ని మన కంటికి కనిపిస్తుంటాయి. అందులో ఒకటి సూర్యాస్తమయం. వయ్యారాలు ఒలికే బవనాసి నది, కృష్ణమ్మలో కలిసే చోట ఎరుపువర్ణ కాంతిలో సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం సప్తనదీ సంగమమైన సంగమేశ్వర క్షేత్రంలో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది – కొత్తపల్లి



ఘాట్‌రోడ్డులో వాహనాలు ఢీ



దారి వెంట పడిన మిర్చి బస్తాలు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులోని గాజులపల్లె సమీపంలో ఉన్న అంకిరెడ్డిచెరువు వద్ద మంగళవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్నాయి. నంద్యాల నుంచి గుంటూరుకు వెళ్తున్న మిర్చీ బస్తాల లారీ, నంద్యాల వైపు వస్తున్న మొక్కజొన్నల లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో మిర్చి బస్తాలు రోడ్డు వెంట పడటంతో ట్రాఫిక్‌కు కాసేపు అంతరాయం ఏర్పడింది. అయితే ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే తోటి ప్రయాణికులు, స్థానికులు సహాయ సహకారాలు అందించడంతో రాకపోకలు యధావిధిగా సాగాయి.

శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని పలువురు ప్రముఖులకు దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.జవహర్‌రెడ్డిని దేవస్థాన కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణను ఆహ్వానించారు. వారికి వేదాశీర్వచనంతో పాటు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలోని ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేస్తున్న స్వామిరెడ్డి(58) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. అర్ధరాత్రి 12.30గంటల సమయంలో ఆయాసం రావడంతో దేవస్థానం సిబ్బంది వైద్యశాలకు తరలించారు. సుమారు 2గంటల పాటు వైద్యులు అత్యవసర చికిత్సలు అందించిన అనంతరం అంబులెన్స్‌లో సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అండగా ఉంటుందని కుటుంబీకులకు భరోసా ఇచ్చారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 90వ వర్ధంతిని మంగళవారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో నిర్వహించారు. భగత్ సింగ్ కాలనీలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, మండల అధ్యక్షులు వై.శ్రీను మాట్లాడుతూ విదేశీ దోపిడికి వ్యతిరేకంగా, పరాయి పాలనను సహించలేక భారతదేశ విముక్తి కోసం పోరాడిన ధీరుడని ఆయనను కొనియాడారు. కార్యక్రమంలో కొమరంభీం ఆదివాసి చెంచుగిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.మల్లికార్జున, వెంకటేష్, అబ్బాస్, కొల్లమయ్య, మల్లమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలకే మద్దతు

ఆత్మకూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలకే తాము మద్దతు ఇస్తామని మాలమహానాడు సీనియర్ నాయకులు ఎలిషా, భాస్కర్, చింతలయ్య, రమేష్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్నాయని, మాదిగలు, మాలలు సోదర భావంతో జీవిస్తూ ఉంటే వారి మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టడం అన్యాయమన్నారు. మార్చి 3న బాపట్ల జిల్లా కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అబ్రహం, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, జయపాల్, ఆర్టీసీ మాలమహానాడు అధ్యక్షుడు శీలయ్య, సురేష్, చంద్రశేఖర్, చంద్రబాబు పాల్గొన్నారు.

కేసీలో కొంగల కోలాహలం

పాములపాడు: కేసీ కెనాల్‌లో నీరు అడుగంటడంతో కొంగల వేట ముమ్మరం అయ్యింది. మండల కేంద్రంలో కేసీ కెనాల్‌లో నీరు కొద్దిగా నిలిచి ఉన్నచోట కొంగలు వాలాయి. చేపల కోసం అరకొర నీటిలో కలియ తిరుగుతూ ఆహారం కోసం అన్వేషిస్తూ కనిపించాయి. కొన్ని కొంగలకు చిన్నపాటి చేపలు దొరకడంతో వారి అన్వేషణ ఫలితం దక్కినట్లైంది. ఏది ఏమైనా కేసీ కెనాల్‌లో అడుగంటిన నీటిలో కొంగల విహారం చూపరులకు కనువిందు చేసింది.



వైద్య శిబిరానికి విశేష స్పందన

వెలుగోడు: పట్టణంలోని వంశీధర నర్సింగ్ హోంలో మంగళవారం డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ పద్మావతమ్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో నంద్యాల పట్టణ ఐకాన్ ఐవీఎఫ్ సంతాన సాఫల్య కేంద్రం నుంచి డాక్టర్ ఎం.తనూజ పాల్గొని వైద్య సేవలు అందించారు. 40 పేషెంట్స్‌కి సంతాన సాఫల్యం కోసం చిన్న చిన్న సమస్యలను గుర్తించి మందులు, లహాలు అందించారు. రాయలసీమ ఐ హాస్పిటల్ నుంచి డాక్టర్ కే కావ్య కొండ కంటి వైద్య, శాస్త్ర చికిత్స నిపుణులు పాల్గొని 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

నేడు జై భీమ్ పార్కు ప్రారంభోత్సవం

నందికొట్కూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంలో కుడా ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మించిన జైభీమ్ పార్కును బుధవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ మంగళవారం తెలిపారు. పార్కుకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టినట్లు వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు.

శివస్వాముల ఊరేగింపు

ఆత్మకూరు: పట్టణంలో మంగళవారం రాత్రి శివస్వాములు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం నుంచి వందలాది మంది శివస్వాములు ఓం నమఃశివాయ మంత్ర జపంతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భజాభజంత్రీలు, శివస్వాముల రూపాలతో చిన్నారుల వేషాధారణ, భజనలు ఆకట్టుకున్నాయి. కొత్తబస్టాండ్, గాడ్‌సెంటర్, పాత బస్టాండ్‌తో పాటు పట్టణంలోని పలు పురవీధుల గుండా ఊరేగింపు సాగింది.

'పల్స్ పోలియో'కు ఏర్పాట్లు పూర్తి

నంద్యాల టౌన్: జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ తేదీ జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా వైద్యాధికారి వెంకట రమణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,34,382 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. మార్చి 4, 5 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు చుక్కలు వేస్తారన్నారు. మార్చి 3న రైల్వేస్టేషన్, బస్టాండ్ల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ.. మొదటి రోజున జిల్లాలో 1313 బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. 4,5వ తేదీల్లో 2626 బృందాలు ఇంటింటికి తిరిగి పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తారన్నారు.

ఓంకారంలో 7 నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు



ఓంకారం క్షేత్రం సుందర దృశ్యం



ఓంకార సిద్ధేశ్వరస్వామి

మహానంది: ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారం ఆలయంలో మార్చి 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ తేదీన బండిఆత్మకూరు నుంచి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం, నందికోలు నృత్యోత్సవాలు ఉంటాయన్నారు. 8న ఉత్సవ మూర్తులు బండిఆత్మకూరు నుంచి బయలుదేరి శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల్లో గ్రామోత్సవంగా ఓంకారం ఆలయానికి చేరుతాయని తెలిపారు. ప్రాతఃకాలమున స్వామి, అమ్మవార్లకు గణపతిపూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం పూజలు ఉంటాయని చెప్పారు. లింగోద్భవం కాలంలో మూలవరులైన శ్రీ ఉమాసమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, తెల్లవారుజామున కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 9న స్వామి, అమ్మవార్లకు నంది వాహనంపై ఉత్సవం, 10న సాయంత్రం నాలుగు గంటల నుంచి రథోత్సవం, రాత్రి వసంతోత్సవం పూజలు ఉంటాయన్నారు. 11న స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను బండిఆత్మకూరుకు చేర్చి గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. భక్తులకు కాలక్షేపం కోసం చెక్కభజన, శాస్త్రీయ కూచిపూడి నృత్య ప్రదర్శన, పంచముఖములు డ్రామా, సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.